సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 18 । జూలై । 2024



వెళ్లొస్తా..మరి!

చక్కని ప్రణాళికకు సమర్థవంతమైన తోడ్పాటుతోనే విజయం సాధ్యమవుతుందని అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. - 8లో



రామతీర్థంలో చాతుర్మాస దీక్ష ప్రారంభం - 8లో

రామతీర్థం రామస్వామి వారి ఆలయంలో చాతుర్మాస దీక్ష బుధవారం ప్రారంభమైంది.

గుణానపురంలో గజరాజులు

కొమరాడ: ఇటీవల వరకు మండలంలోని పాత మార్కొండపుట్టిలో సంచరించిన గజరాజులు బుధవారం గుణానపురం పరిసర ప్రాంతాలకు చేరుకున్నాయి. ఏనుగుల సంచారంతో కూరగాయలు, వరినారు మడులు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పొలం పనికి వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. గజరాజుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు

- జేసీ ఎస్ఎస్ శోభిక

పార్వతీపురం: జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర సరుకులైన బియ్యం, కంది పప్పు ధరల నియంత్రణకు జిల్లాలో పది రోజుల క్రితం పార్వతీపురం, సాలూరు, పాలకొండలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. వినియోగదారులకు స్థిరమైన ధరలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేసేందుకు కందిపప్పు, బీపీటీ/సోనామసూరి ఫైన్ రైస్ (స్టీమ్డ్), బహిరంగ మార్కెట్లో రూ. 181, 55.85, 52.40 ధరలుంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో రూ.160, రూ.49, రూ.48కే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మెస్ చార్జీలు విడుదల చేయండి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని, మెస్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, జిల్లా కార్యదర్శి ఎస్. నాగభూషణ్ డిమాండ్ చేశారు. అమర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి, సమస్యలను తెలుసుకుంటామన్నారు. వాటి పరిష్కారం కోసం ఆగస్టు 6న అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు శాంతియుత ధర్నాలు నిర్వహించి విద్యార్థుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. జగదీష్, బాబ్జి, గౌరీశంకర్, సుమన్, జ్యోతి, భాను పాల్గొన్నారు.

బీజేపీతో స్నేహం రాష్ట్రానికి ప్రమాదకరం

- దేశ ప్రయోజనాలకు నష్టం చేకూర్చేలా బీజేపీ విధానాలు
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ

పార్వతీపురంటౌన్: దేశ ప్రయోజనాలకు నష్టం చేకూర్చేలా బీజేపీ విధానాలు ఉన్నాయని, ప్రాంతీయ పార్టీలు బీజేపీతో స్నేహం చేయడం రాష్ట్రానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బారావమ్మ అన్నారు. సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన పార్వతీపురం మన్యం జిల్లా సీపీఎం విస్తృత సమావేశంలో ఆమె మాట్లాడారు. 18వ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి గణనీయమైన రీతిలో ఎదురుదెబ్బ తగిలిందన్నారు. దేశ ప్రజానీకం మన రాజ్యాంగం లౌకిక, ప్రజాతంత్ర విలువలు పట్ల ప్రగాఢమైన అనురక్తిని, అభిమానాన్ని ప్రదర్శించారన్నారు. దేశ ప్రజల జీవన ప్రమాణాలు దిగజారి పోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. శివ్వాం దళితులపై దాడి చేసిన పెత్తందారులను అట్రాసిటీ చట్టం ప్రకారం అరెస్టు చేయాలని, దళితుల భూమి తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.మన్మథరావు, పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు కె.గంగునాయుడు, బి. ఇందిర, ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. జిల్లా పరిస్థితులపై ఇరువురు చర్చించారు.



బొబ్బిలి ఇసుక స్టాక్ పాయింట్

ఉచిత ఇసుక.. ట్రాక్టర్ ధర రూ.5వేలు!

- తూకంలోనూ తేడాలు
- స్టాక్ పాయింట్ల వద్ద నగదు కోసం క్యూఆర్ కోడ్‌లు
- ఏటీఎం స్వైపింగ్ మెషీన్లు
- నగదు ఇతర జిల్లాల్లోని అకౌంట్లలోకి..
- స్టాక్ పాయింట్ల వద్ద కానరాని మైనింగ్ సిబ్బంది
- వినియోగదారులు, ట్రాక్టర్ యజమానులకు తప్పని ఇబ్బందులు

బొబ్బిలి:

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాకు ఇసుక సరఫరా కోసం కొత్తవలస, బొబ్బిలి, డెంకాడ వద్ద మూడు ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడకు ఇసుక కోసం వెళ్లేవారికి ధరలు చుక్కలనంటుతున్నాయి. మరోవైపు ఇసుక తూకంలోనూ తేడాలు వస్తున్నాయంటూ ట్రాక్టర్, లారీ యజమానులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గతంలో వలే ఆన్‌లైన్ రశీదులు కాకుండా ఫోన్‌పేలు చేయమంటున్నారు. ఆ సొమ్ము ఇతర జిల్లాల్లోని ఖాతాలకు వెళ్తుంటే తామేం చేయాలంటూ స్టాక్ యార్డు సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుక ధర రూ.5వేలు పైబడి పడుతోందని డ్రైవర్లు వాపోతున్నారు.

గృహ యజమానులకే కష్టాలు..

ఇళ్లు నిర్మించుకుంటున్న పేద, మధ్య తరగతి వారికి ఇసుక తూకం తక్కువగా ఇస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు మాత్రం ఇసుకను లారీలకు చక్కగా లోడ్‌చేస్తున్నట్టు సమాచారం. రామభద్రపురం ప్రాంతంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులకు బొబ్బిలి స్టాక్ యార్డు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఒక రోజులో 22కు పైగా ఇక్కడ నుంచి ఇసుక లావాదేవీలు జరిగితే అందులో ఆరుకు పైగా లారీలతోనే వెళ్లింది. గృహ యజమానులు తీసుకెళ్లే ట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో ఇసుకను లోడ్‌వేయడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

కానరాని మైనింగ్ సిబ్బంది

బొబ్బిలి స్టాక్ పాయింట్‌లో ప్రధాన శాఖ అయిన మైనింగ్ సిబ్బంది కానరావడం లేదు. వీరు ఉంటే ఇసుక సరఫరాకు సంబంధించిన సమస్యలు తీరేందుకు కాస్తయినా వెసులుబాటు ఉండేది. కానీ వారు ప్రారంభం నుంచి ఇక్కడ లేరు. దీంతో మైనింగ్‌పై అనుభవం లేని ఎస్ఈబీ, వీఆర్వోలతోనే స్టాక్ పాయింట్‌లను నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దడ పుట్టించేలా ధర

బొబ్బిలి ఇసుక యార్డు నుంచి తెర్లాం మండలానికి ట్రాక్టర్ ఇసుక తరలించేందుకు రూ.5వేల పైమాటే ఖర్చు అవుతోంది. ఇంత ధర చెల్లించి ఇసుక తీసుకువెళ్లలేమని ట్రాక్టర్ యజమానులు కొందరు తిరిగి వెళ్లిపోతున్నారు. బొబ్బిలి పట్టణం పక్కనే ఉన్నందున రూ.800 నుంచి వెయ్యి రూపాయల రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు కలుపుకుని రూ.4 వేలు అవుతుంది. ఈ ధరలను చూసి ఉచిత ఇసుక ఎక్కడంటూ వినియోగదారులు, ట్రాక్టర్ యజమానులు ప్రశ్నిస్తున్నారు. దీనికి సిబ్బంది నుంచి మౌనమే సమాధానం.



చిత్రంలోని వ్యక్తిపేరు పందిరిపల్లి అమర్‌నాథ్. ఆయనది బొబ్బిలి పట్టణంలోని నాలుగో వార్డు. బొబ్బిలి ఇసుక స్టాక్ పాయింట్‌లో రెండు ట్రాక్టర్ లోడ్ల ఇసుక కోసం రూ.2,420లు చొప్పున రెండు సార్లు వారు చెప్పిన ఫోన్ నంబర్‌కు ఫోన్ పే చేశారు. ఆ సొమ్ము మా ఖాతాలోకి రాలేదని, శ్రీకాకుళం జిల్లా మైనింగ్ ఏడీ ఖాతాలోకి వెళ్లిపోయిందని నిర్వాహకులు తెలిపారు. మరి తను చెల్లించిన సొమ్ము మాటేమిటని ప్రశ్నిస్తే.. అక్కడకు వెళ్లి వారి వద్ద నుంచి లేఖ తీసుకుని వస్తే అప్పుడు చూస్తామని చెప్పడంతో ఆయన లబోదిబోమంటున్నారు. అంతే కాదు ట్రాక్టర్‌లో నాలుగు టన్నుల ఇసుక రావడం లేదని, డబ్బు చెల్లించినదాని కన్నా చాలా తక్కువ ఇసుక వస్తోందని వాపోయారు. ట్రాక్టర్ ఇసుక ధర రూ.5వేలు పైబడి పడుతోందన్నారు. పోనీ మైనింగ్ అధికారులకు చెబుదామంటే స్టాక్ పాయింట్‌లో లేరని పేర్కొన్నారు.



స్టాక్ పాయింట్‌లో మైనింగ్ సిబ్బంది స్థానంలో రెవెన్యూ, ఎస్ఈబీ సిబ్బంది



బిల్లు రాస్తున్న వీఆర్వోలు

మైనింగ్ అధికారుల దృష్టిలో పెట్టాం

బొబ్బిలి స్టాక్ యార్డులో ఇసుక తూకం తక్కువగా వస్తోందని ట్రాక్టర్ యజమానుల ఫిర్యాదు మా దృష్టికి వచ్చింది. దీనిపై పరిశీలించాలని మైనింగ్ డీడీ దృష్టికి తీసుకెళ్లాం. ఫోన్‌పే ద్వారా ఒకట్రెండు లావాదేవీలు ఇతర జిల్లాల ఖాతాలకు వెళ్లాయి. ఆ సమస్య పరిష్కరించి అక్కడున్న క్యూఆర్ కోడ్‌ల ద్వారా పేమెంట్లు జరుగుతున్నాయి. మైనింగ్ సిబ్బంది లేరని ఆ శాఖ వారిని అడిగితే మాకు సిబ్బంది తక్కువని చెప్పారు.

– త్రినాథరావునాయుడు, తహసీల్దార్, బొబ్బిలి

‘ఉపాధి’లో అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్
- టీడీపీవి కక్షపూరిత చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం సుందరయ్య భవన్‌లో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అవినీతికి తెరతీశారన్నారు. డ్వామా పీడీ దగ్గర నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. విచారణ సమయంలో కేవలం క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు బలవుతున్నారన్నారు.

కక్షపూరితంగా వ్యవహరిస్తున్న టీడీపీ నాయకత్వం

కొన్నిచోట్ల టీడీపీ నాయకత్వం కక్షగట్టి తమ అనుయాయులతో ఫిర్యాదులు చేయించి ఫీల్డు అసిస్టెంట్లను తీసివేయించే ప్రయత్నం చేయడం విచారకరమని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. ఫీల్డు అసిస్టెంట్లు వసూలు చేస్తున్న డబ్బులు టెక్నికల్ అసిస్టెంట్‌లు ద్వారా ఏపీఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారులతో పాటు డ్వామా పీడీ వరకు చేరుతున్నాయని ఆరోపించారు. ఫీల్డ్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో లేని వారి పేర్లు, వలసలకు వెళ్లిన వారి పేరున, పార్వతీపురం, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగరీత్యా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడిన వారి పేరున లక్షల రూపాయలు బిల్లులు చేసి తినేస్తున్నారన్నారు. జిల్లా స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించి ఉపాధి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజుల్లో కూలీలను కదిలించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు సింహాచలం, గరుగుబిల్లి శ్రీనివాసరావు, పిట్టల సీతారాం, వెంకటస్వామి, పాలమెట్ట రాము పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటో ప్రారంభం

- 4 గంటలు బ్యాటరీ చార్జిచేస్తే 120 కి.మీ. ప్రయాణం
- సెంచూరియన్ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ డి.ఎన్.రావు



బ్యాటరీ ఆటోను ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఆయన సతీమణి పద్మ

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వవిద్యాలయం రూపొందించిన ఎలక్ట్రిక్ బ్యాటరీ ఆటోను వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఆయన సతీమణి పద్మ బుధవారం ప్రారంభించారు. లిథియమ్ ఐయాన్ బ్యాటరీతో నడిచే ఆటోలో డ్రైవర్‌తో కలిపి ఐదుగురు ప్రయాణించవచ్చని జీటీఈటీ సీఈఓ బాబుశంకర్ తెలిపారు. నాలుగు గంటల పాటు బ్యాటరీ చార్జి చేస్తే 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చన్నారు. గతంలో బ్యాటరీతో నడిచే ఆటోల తయారీకి స్టీల్ ఉపయోగించగా, వీటిని ఫైబర్‌తో తయారు చేసినట్టు వెల్లడించారు. ఆటో చూపరులను ఆకర్షించడంతో పాటు ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఏసీ డీన్ పీఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ పాల్గొన్నారు.

కౌలురైతుల సమస్యల పరిష్కారానికి డిమాండ్



కౌలు రైతుల సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

శృంగవరపు కోట: దేవదాయ–ధర్మాదాయ శాఖ భూములు సాగుచేస్తున్న కౌలు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు బి.రాంబాబు, చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కౌలురైతులతో కలెక్టర్ కార్యాలయం వద్ద సదస్సు నిర్వహిస్తామని బుధవారం చెప్పారు. దేవదాయ, మాన్సాస్ భూములను కౌలుకు చేస్తున్న రైతులకు కౌలు కార్డులు లేక ప్రభుత్వ రాయితీలు అందడంలేదన్నారు. బ్యాంకు రుణాలు, పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. సదస్సుకు కౌలు రైతులందరూ హాజరు కావాలని కోరారు. ఈ మేరకు సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మద్దిల రమణ, కల్లేపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ మండలి సీపీఎంగా ఉమామహేశ్వరావు

విజయనగరం ఫోర్ట్: ఎయిడ్స్ నియంత్రణ మండలి క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ (సీపీఎం)గా ఉమామహేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎయిడ్స్ నియంత్రణశాఖ అధికారి డాక్టర్ రాణిని మర్యాద పూర్వకగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. హెచ్ఐవీ బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ సీపీఎంగా పనిచేసిన పి.బాలాజీ రాజమండ్రికి బదిలీ అయ్యారు.

ఐసీడీఎస్‌లో ఉద్యోగాలకు లంచం డిమాండ్

- అధికారుల పేరుచెప్పి డబ్బులు ఇవ్వాలని దరఖాస్తుదారులకు ఫోన్ చేస్తున్న అగంతకుడు
- ఒక్కోపోస్టుకు రూ.50వేల నుంచి రూ. 2లక్షలు ఇవ్వాలని డిమాండ్
- డబ్బులు ఇవ్వకపోతే పోస్టు వేరేవారికి ఇచ్చేస్తామంటూ బెదిరింపు

విజయనగరం ఫోర్ట్:

‘హలో నేనండీ కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ డిపార్టమెంట్‌లో పనిచేస్తున్నాను. మీరు ఐసీడీఎస్‌లోని సోషల్ వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేశారు కదా. మీకు పోస్టు కావాలంటే రూ.లక్ష అవుతుంది. ముందుగా రూ.50వేలు నేను చెప్పిన చోటకు తేవాలి. కలెక్టర్ నుంచి అందరు అధికారులకు ఇచ్చుకోవాలి కదా. లేకపోతే మీ పోస్టు వేరొకరికి ఇచ్చేస్తామంటూ సోషల్ వర్కర్ పోస్టుకు దరఖా స్తు చేసిన ఓ అభ్యర్థికి రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశారు’.

- అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తు చేసిన మరో అభ్యర్థికి కూడా రూ.50 వేలు డిమాండ్ చేశాడు. ముందుగా రూ.25 వేలు ఫోన్‌పే చేయాలని సూచించాడు. డబ్బులు ఇవ్వకపోతే ఆ పోస్టును వేరే వ్యక్తికి ఇచ్చేస్తామంటూ రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఆ అభ్యర్థికి స్పష్టం చేశాడు.

ఈ ఇద్దరే కాదు సుమారు 20 మందికి ఆ వ్యక్తి ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్ చేయడం ప్రస్తుతం అధికార వర్గాల్లో కలకలం రేపుతోంది. ఒక్కో పోస్టుకు ఒక్కో విధంగా డబ్బులు డిమాండ్ చేసినట్టు ఫోన్ రికార్డులు ఆధారంగా తెలుస్తోంది. కొన్ని పోస్టులకు రూ.50 వేలు నుంచి రూ. లక్ష వరకు, కొన్ని పోస్టులకు రూ.లక్ష నుంచి రూ. 2లక్షల వరకు డిమాండ్ చేశాడు.



ఐసిడిఎస్ కార్యాలయం

23 పోస్టులకు 384 దరఖాస్తులు

ఐసీడీఎస్ పరిధిలోని జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ)లో 23 పోస్టులకు గాను 384 మంది దరఖాస్తుచేశారు. దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి మెరిట్ జాబితాను అధికారులు సిద్ధం చేశారు. డీసీపీయూ పోస్టుకు 80 దరఖాస్తులు, డీఈఓ పోస్టుకు 127, సోషల్ వర్కర్–38, స్టోర్ వర్కర్–50, కుక్ పోస్టుకు–26, హౌస్ కీపర్ పోస్టుకు–16, నైట్ వాచ్‌మన్ పోస్టుకు–19, ఎడ్యుకేటర్ పోస్టుకు–17, మ్యూజిక్ టీచర్ పోస్టుకు–7, యోగా టీచర్ పోస్టుకు–4 దరఖాస్తులు వచ్చాయి.

మా దృష్టికి వచ్చింది

రాజ్‌కుమార్ అనే వ్యక్తి దరఖాస్తు చేసిన అభ్యర్థులను డబ్బులు అడిగినట్టు ముగ్గురు అభ్యర్థులు నాకు వాయిస్ మేసేజ్‌లు పెట్టారు. వాటిని వన్‌టౌన్ సీఐకి పంపించాను. గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తాను. అటువంటి వ్యక్తుల మాటలు నమ్మవద్దు. ప్రతిభ ఆధారంగానే పోస్టులు భర్తీ చేస్తాం. ఇందులో ఎలాంటి రాజీ ఉండదు. మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దు.

– బి.శాంతకుమారి, పీడీ, ఐసీడీఎస్

ఎస్పీకి సవాళ్ల స్వాగతం!

- జిల్లాలో పెరిగిన చోరీలు
- గుప్పుమంటున్న మాదక ద్రవ్యాలు
- పట్టణంలో ట్రాఫిక్ సమస్య
- నిత్యం రోడ్డు ప్రమాదాలు
- ఎస్పీగా నేడు బాధ్యతలు చేపట్టనున్న మాధవరెడ్డి



పార్వతీపురం మన్యం జిల్లా నూతన ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్:

జిల్లాలో ఇటీవల కాలంలో లోపించిన శాంతిభద్రతలు పెను సవాళ్లుగా మారాయి. నేరాలు, ఘోరాలు పెచ్చుమీరాయి. అసాంఘిక శక్తులు జూలు విదుల్చుతున్నాయి. చోరీలు ఎక్కువయ్యాయి. మత్తు పదార్థాల వినియోగం, రవాణా వంటివి జిల్లాలో కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న జిల్లా పోలీస్ బాస్‌కు పెనుసవాళ్లుగా కనిపిస్తున్నాయి. జిల్లాలో 2 సబ్ డివిజన్లు, 2 సర్కిల్స్, 19 రూరల్, 2 అర్బన్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. అధికారం, అర్థ బలం ఉంటేనే క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారమవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 15 నుంచి 25 మందికి పైగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తున్నారంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం మహిళల భద్రతకు దిశ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసి సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం మారడంతో పర్యవేక్షణ కొరవడిందన్న అపవాదు ఉంది. ట్రాఫిక్ విభాగంలో అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పలు స్టేషన్లలో రైటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటిని పూర్తి స్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

చెలరేగుతున్న నేరగాళ్లు

పోలీసుల ఉదాసీన వైఖరి, రాజకీయ నేతల అండదండలతో నేరగాళ్లు విజృంభిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడుల కేసుల్లో అధిక శాతం రౌడీషీటర్లు, పాత నేరస్తులే నిందితులుగా ఉంటున్నారు. గతంలో ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్, రాత్రి గస్తీలో పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉండేది. గతంలో పీడీ యాక్ట్‌లు నమోదు చేయడంతో కొంత మేర నేరాలు, సారా రవాణా తగ్గు ముఖం పట్టినప్పటికి ఇటీవల తిరిగి ఊపందుకున్నాయి. ఇక జిల్లాలో పగలు, రాత్రి తేడా లేకుండా చైన్‌స్నాచర్లు తెగబడుతున్నారు. గుడి, బడి, ఇళ్లు, కార్యాలయాల్లో ప్రజాధనాన్ని, ఆస్తులను దోచుకెళుతున్నారు. ఓవైపు పోలీసులు కేసులో నిమగ్నమై ఉండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతూ సవాల్ విసురుతున్నారు. సీసీఎస్, క్రైమ్ పార్టీలు మాత్రం నేరస్తులను పట్టుకుని చోరీ సొత్తును రాబడుతున్నారు.

మత్తుపదార్థాల రవాణా..

జిల్లాలో మత్తు, సారా, మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయి. విద్యార్థులు, యువతే లక్ష్యంగా చేసుకుని నిందితులు పెద్దఎత్తున వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒడిశాకు సరిహద్దుగా ఉన్న పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల నుంచి మాదకద్రవ్యాల రవాణా ఎక్కువగా సాగుతోంది. సారా రవాణా, విక్రయాలపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రాఫిక్.. ఇది జటిల సమస్య

పార్వతీపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎస్పీలు మారినప్పుడు కొత్తగా వచ్చిన వారు తొలి ప్రాధాన్యతగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని చెబుతున్నారు. గత అధికారులు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ బూత్‌లు పెట్టి సిబ్బందిని ఏర్పాటు చేసినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంలేదు. నేడు నూతనంగా బాధ్యతలు చేపటనున్న జిల్లా పోలీస్ బాస్ ఈ సమస్యలను పరిష్కరిస్తారని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు.



మేఘావృతం

విజయనగరం జిల్లా కేంద్రానికి సమీపంలోని గుంకలాం వద్ద బైపాస్ రోడ్డును తాకేలా కనిపించిన దట్టమైన మేఘాలు చూపరులకు బుధవారం కనువిందు చేశాయి. రైతులను ఆశల్లో ముంచెత్తాయి. కాసేపటికి చిరుజల్లును కురిపించి కనుమరుగయ్యాయి. రైతులకు నిరాశను మిగిల్చాయి.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

క్లుప్తంగా

67 సచివాలయాల్లో ఆధార్ సేవలు


జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి రామచంద్రరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని 67 సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి వస్తున్నట్లు జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ అప్‌డేట్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి దగ్గరలో ఆధార్ సేవలున్న సచివాలయంలో సేవలను వినియోగించుకోవచ్చునని సూచించారు.

నానో కారు నుంచి పొగమంటలు


నానో కారు నుంచి చెలరేగుతున్న మంటలు

పార్వతీపురంటౌన్: పట్టణంలో నానో కారు నుంచి బుధవారం పొగమంటలు వచ్చాయి. ఈ మేరకు ఫైర్ అధికారి పి.పైడిరాజు తెలిపిన వివరాల ప్రకారం సంతా వీధికి చెందిన శ్రీనివాసరావు నానో కారులో బ్యాటరీ కాలిపోవడం వల్ల షార్ట్ సర్క్యూట్ అయి పొగమంట రావడంతో స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.20 వేల నష్టం జరిగి ఉంటుందని ఫైర్ అధికారులు అంచనా వేశారు.

క్రీడాకారిణికి రాకెట్ వితరణ


మౌనికకు ర్యాకెట్ ఇస్తున్న తాతాజీ తదితరులు

శృంగవరపుకోట: స్థానిక ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న పి.మౌనికకు ధర్మవరం గ్రామస్తుడు కాపుగంటి తాతాజీ రూ.5000 విలువైన రాకెట్‌ను బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న క్రీడాకారులను దాతలు ప్రోత్సహించడం వల్ల ఎస్.కోటలో షటిల్‌బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధి చెందుతోందన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన


జాబ్ ఆర్డర్లతో అభ్యర్థులు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని భాస్కర్ డిగ్రీ కళాశాలలో వర్క్‌రూట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు జిల్లాలోని 400మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కాగా వారిలో 110మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వర్క్ రూట్ కన్వీనర్ గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్, ఎం.రవిశాస్త్రి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రామతీర్థంలో చాతుర్మాస దీక్ష ప్రారంభం


రామతీర్థంలో ఏకాదశి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి వారి ఆలయంలో చాతుర్మాస దీక్ష బుధవారం ప్రారంభమైంది. ఏటా ఆషాడశుద్ధ ఏకాదశి మొదలుకుని కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలలు స్వామివారు యోగనిద్రలో, చాతుర్మాస దీక్షలో ఉంటారు. బుధవారం ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి సన్నిధిలో విశ్వక్సేన ఆరాధన, శ్రీ సీతారామ శయన మూర్తులకు ప్రత్యేకమైన పల్లకిలో పవళింపు సేవ నిర్వహించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

వెళ్లొస్తా..మరి!

- బదిలీ ఎస్పీ ఎం.దీపిక
- మూడేళ్ల పాటు జిల్లాలో సేవలు
- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం


ఎస్పీ ఎం.దీపిక దంపతులను సత్కరిస్తున్న జిల్లా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు

విజయనగరం క్రైమ్: చక్కని ప్రణాళికకు సమర్థవంతమైన తోడ్పాటుతోనే విజయం సాధ్యమవుతుందని అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి స్థానిక ఎస్.కన్వెన్షన్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆమెకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను పనిచేసిన పదేళ్లకాలంలో నాలుగేళ్లు విజయనగరం జిల్లాలోనే ఏఎస్పీగా, ఎస్పీగా పనిచేయడంతో తనకు జిల్లా ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందన్నారు. జిల్లా ప్రజలు చాలా సౌమ్యులని, వారి సమస్యలను పరిష్కరించేందుకు సకాలంలో స్పందిస్తే కుటుంబసభ్యుల్లా ఆదరిస్తారని సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్‌శాఖలో అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేయడంతో ఎన్నో క్రియాశీలకమైన కేసులను ఛేదించగలిగామన్నారు. ఈ సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీలు ఎం.దీపిక, విక్రాంత్ పాటిల్ దంపతులను పోలీస్ అధికారులు, సిబ్బంది, వేదపండితుల మంత్రోచ్చారణలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, డి.విశ్వనాథ్, పి.శ్రీనివాసరావు, ఏఎస్.చక్రవర్తి, యూనివర్స్, పీపీ.జయలక్ష్మి, సీఐలు కేకేవీ.విజయనాథ్, బి.వెంకటరావు, జె.మురళి, రాజశేఖరరావు, ఉపేంద్రరావు, ఎస్సైలు యు.మహేష్, శ్యామల, తదితరులు ఎస్పీ సేవలను ప్రశంసించారు. అనంతరం ఎస్పీ దీపికను జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, పుష్పమాలాంకృతులను చేసి, జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు, సన్మానపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, జర్నలిస్టులు పాల్గొని ఎస్పీ దంపతులకు అభినందనలు తెలిపారు.

మూడేళ్ల చిన్నారిపై కుక్కల దాడి

- గాయాలపాలైన బాలిక
- బెంబేలెత్తుతున్న పాచిపెంట గ్రామస్తులు


గాయాలతో చిన్నారి

పాచిపెంట: మండల కేంద్రంలో గ్రామ సింహాలు(కుక్కలు) స్వైర విహారం చేస్తున్నాయి. స్థానిక దాసరవీధికి చెందిన మూడేళ్ల చిన్నారి హంసినిని కుక్కలు బుధవారం గాయపరిచాయి.వెంటనే గుర్తించిన స్థానికులు చిన్నారిని స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి సాలూరు ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. వీధుల్లో పదికి పైగా కుక్కలు గుంపుగా స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.


తప్పుడు కథనాలపై చర్యలు తీసుకోవాలి

- అంబేడ్కర్ రైట్స్ ఫోరం డిమాండ్


రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న భానుమూర్తి, తదితరులు

విజయనగరం రూరల్: దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, గిరిజన సామాజిక వర్గానికి చెందిన మహిళ శాంతికుమారిపై ఉద్దేశపూర్వకంగా, వివక్షతో తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్న చానళ్లు, వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని అనుసరించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ రైట్స్ ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతికుమారిపై 5 రోజులుగా కొంత మంది వ్యక్తులు, సంస్థలు తప్పుడు కథనాలు ప్రసారం చేయడమే కాకుండా, వాటిని బహిర్గతం చేస్తున్నారన్నారు. దీంతో పాటు అబద్ధపు సాక్ష్యాలు సృష్టించి, వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతే కాకుండా గిరిజన సామాజికవర్గానికి చెందిన శాంతికుమారిపై లైంగిక సంబంధిత తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రాన్ని ఆయన కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు బొంగు భానుమూర్తి, చిన్నం అరుణ్‌కుమారి, పూసర్ల మధుసూదనరావు, జె.రాజ్‌కుమార్, వంశీ, గౌరీష్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మృతుని ఆధార్ కార్డ్


ట్రాక్‌పై మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్సై రవివర్మ

విజయనగరం క్రైమ్: ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్‌కు చెందిన ప్రతాప్ చంద్రో పాత్రో (62) ప్రమాదవశాత్తు దుర్గ్ ప్యాసింజర్ రైలు కింద పడి బుధవారం మృతిచెందారు. ఒడిశాలో కానిస్టేబుల్‌గా పనిచేసి పదవీవిరమణ చేసిన ఆయన బెంగళూరు వెళ్లేందుకు భార్యతో సహా ఒడిశా నుంచి దుర్గ్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం బయల్దేరారు. రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్లే రైలు విజయనగరంలో ఉదయం 9.07గంటలకు ఆగింది. ముందుగా ఆయన భార్య గీతాంజలి రైలు దిగారు. ప్రయాణికులంతా దిగుతుండగానే ప్రతాప్ లగేజీని దింపుతున్న సమయంలో 9.12 గంటలకు రైలు కదిలింది. ఈ లోగా ఆయన తొందరగా దిగేందుకు ప్రయత్నించే క్రమంలో లగేజీతో పాటు రైలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో పడిపోయారు. అంతలో రైలు కదిలిపోవడంతో రెండు కాళ్లు తెగిపోయాయి. తీవ్రరక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కళ్లముందే భర్త మృతిచెందడంతో గీతాంజలి కన్నీటిపర్యంతమైంది. స్థానికులు ఆమెను ఓదార్చారు. రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేశారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవివర్మ తెలిపారు.

జర్నలిస్టు హెల్త్‌స్కీమ్ పొడిగింపు

పార్వతీపురం: వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌స్కీమ్ పథకాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని విధంగా అనారోగ్యం సంభవిస్తే ప్రతిసారీ రూ.2లక్షల వరకు వైద్యసేవలు అందుతాయని పేర్కొన్నారు. ఇలా సంవత్సరం కాలంలో ఎన్నిసార్లు అయినా పరిమితి లేకుండా సదుపాయాన్ని అందిస్తారన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. అక్రిడేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని పొందవచ్చన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రూ.1,250లు ఈనెల 31లోగా చెల్లించాలన్నారు. డిసెంబర్ 31, 2025 వరకు ఈ స్కీం ద్వారా జర్నలిస్టులు లబ్ధిపొందవచ్చునని తెలిపారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్స్, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబసభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల కాపీలను డీపీఆర్ఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

హత్య కేసు నిందితుడి లొంగుబాటు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

బలిజిపేట: మండలంలోని గంగాడ గ్రామానికి చెందిన సావిత్రి హత్య కేసులో హతురాలి మరిది జి.హరిబాబు తనంతట తానే స్వయంగా లొంగిపోయినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన సావిత్రమ్మ కనిపించడం లేదని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహించగా గ్రామ సమీపంలో ఉన్న రామన్నబందలో ఆమె మృతదేహం కనిపించిందని, పోస్టుమార్టం కోసం పంపించగా హత్యకు గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారన్నారు. దీనిపై కేసు నమోదుచేశామని తెలిపారు. అయితే ఇంతలో మృతురాలి మరిది హరిబాబు తానే హత్యచేసినట్టు ఒప్పుకుని గ్రామ వీఆర్వో వద్ద లొంగిపోయాడని చెప్పారు. నిందితుడిని మళ్లీ విచారణ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. హత్యకు వారి మధ్య తలెత్తిన భూతగాదాలే కారణమని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి కరుణ..దేవుడి దయతో..!


తలారి గ్రామం సమీపంలో ఉబాలు వేస్తున్న మహిళలు

- పుట్టెడు ఆశతో ముందుకు సాగుతున్న అన్నదాతలు
- ముమ్మరంగా జరుగుతున్న వరి ఉబాలు


కొట్యాడ గ్రామ పొలాల్లో వరి నారు తీస్తున్న మహిళలు


ఎల్.కోట గ్రామం పొలాల్లో ట్రాక్టర్‌తో దమ్ముపడుతున్న రైతు

లక్కవరపుకోట: ప్రస్తుతం కురుస్తున్న కొద్ది పాటి వర్షాలకు రైతులు ఖరీఫ్ వరి పంట ఉబాలు ప్రారంభించారు. ఈ మేరకు లక్కవరపుకోట మండలంలోని లక్కవరపుకోట, ఖాసాపేట, తలారి, వీరభద్రపేట, కొట్యాడ, గొల్జాం తదితర గ్రామాల్లో ఉబాలు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఖరీఫ్‌లో వరి పంట సాగుకు ప్రభుత్వం సహాయంగా రూ.7,500 రైతు భరోసా రూపంలో అన్నదాతలకు అందజేసేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అటువంటి సహాయం లేకపోయినా అప్పులు చేసి ఖరీఫ్ పంట సాగుకు రైతులు సిద్ధమయారు. వాస్తవానికి గత ఏడాది ఇదే సమయానికి మండలంలో సుమారుగా 50శాతానికి పైగా ఉబాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఇప్పుడిప్పుడే రైతులు ఉబాలు ప్రారంభించారు. పాలకుల దయ లేకపోయినా భగవంతుడిపై భారం వేసి ప్రకృతి సహకారంతో పంటలు సాగుచేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

తూకాల్లో తేడా లేకుండా చూడాలి

- సివిల్ సప్లయిస్ డీఎం మీనా


ఆర్అండ్‌బీ రైతుబజార్‌లో కందిపప్పును పరిశీలిస్తున్న డీఎం మీనా

విజయనగరం ఫోర్ట్: సరుకులు విక్రయించేటప్పుడు తూకాల్లో తేడా లేకుండా చూడాలని సివిల్ సప్లయిస్ డీఎం మీనా హితవు పలికారు. ఈ మేరకు విజయనగరంలోని ఆర్అండ్‌బీ, రింగ్‌రోడ్డు, ఎంఆర్ పాత ఆస్పత్రి వద్ద గల రైతు బజార్‌లను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు బజార్లలో కందిపప్పు, బియ్యం విక్రయాలను ఈ సందర్భంగా పరిశీలించారు. అదేవిధంగా ఇంతవరకు విక్రయించిన కందిపప్పు, బియ్యం వివరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కందిపప్పు, బియ్యం అడిగిన వారందరికీ ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారులు చప్ప సతీష్, అప్పలనాయుడు, ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ బాధ్యత అందరిదీ


వర్క్‌షాప్‌లో పాల్గొన్న రీజనల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ జానకిరామ్ తదితరులు

గరుగుబిల్లి: ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రీజనల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ జానకి రామ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన గరుగుబిల్లి మండలంలోని తోటపల్లిలో గల జట్టు ఆశ్రమ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి నుంచి పొలం బడికి కార్యక్రమంలో భాగంగా రచయితలు రచించిన పాఠ్యాంశాలను విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులకు ప్రకృతి ఆవశ్యకతను వివరిస్తే వారు తల్లిదండ్రులకు వివరించే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. తద్వారా ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్య కరమైన, నాణ్యమైన ఉత్పత్తులను అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలని కోరారు. ఈ సందర్భంగా జానకీ రామ్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత భీమేశ్వరరావు, జట్టు ట్రస్టీ పారినాయుడు తదితరులు దుశ్శాలువతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో సిలబస్ కన్సల్టెంట్లు టి. శివాజీ, ఆర్.వాసుదేవరావు, టి. శివకేశవరావు, ఎల్.వెంకటస్వామి, పి.రవీంద్రనాథ్, బీవీ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

- పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పిలుపు


సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు

పార్వతీపురంటౌన్: సీపీఐ బలోపేతానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని బెలగాం చర్చి సెంటర్ సమీపంలో ఉన్న గిరిజన సామాజిక భవనంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బుడితి అప్పలనాయుడు అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఈ సమావేశాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులంతా విజయవంతం చేయాలని కోరారు. అలాగే సీపీఐ బలోపేతానికి సమితి సభ్యులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, సహాయ కార్యదర్శి టి జీవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు సాలాపు అనంతరావు, సింహాద్రి దుర్గారావు, పువ్వల ప్రసాద్, దుర్గారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొస్తే..పడిపోతున్న ప్లేట్‌లెట్స్..!

- డెంగీ, వైరల్ జ్వరపీడితుల్లో తగ్గుతున్న పరిస్థితి
- ప్రభుత్వ, ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్‌లను ఆశ్రయిస్తున్న రోగుల బంధువులు


ప్లేట్ లెట్స్ నిల్వలను పరిశీలిస్తున్న బ్లడ్ బ్యాంక్ సిబ్బంది


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

విజయనగరం ఫోర్ట్: రవి అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. ఈ నేపథ్యంలో పరీక్షించిన వైద్యులు ప్లేట్‌లెట్స్ తగ్గడంతో ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంక్ నుంచి మూడు ప్యాకెట్ల ప్లేట్‌లెట్స్ తెప్పించి ఎక్కించారు.

- అలాగే రాజేష్ అనే వ్యక్తి జ్వరంతో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అతనికి వైద్య పరీక్షలు నిర్వహించగా ప్లేట్‌లెట్స్ తగ్గాయి. దీంతో వైద్యులు బ్లడ్‌బ్యాంక్ నుంచి నాలుగు ప్యాకెట్ల ప్లేట్‌లెట్స్ తెప్పించి ఎక్కించారు.

జిల్లాలో అధికంగా జ్వరాల వ్యాప్తి

వైరల్ జ్వరాలతో పాటు మలేరియా, డెంగీ జ్వరాల వ్యాప్తి జిల్లాలో అధికంగా ఉంది. డెంగీ జ్వరాలతో పాటు, వైరల్ జ్వరం బారిన పడినవారికి కూడా ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయి. సాధారణంగా డెంగీ బారిన పడినవారికి ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. అయితే ఇప్పుడు సాధారణ జ్వరాలకు కూడా ప్లేట్‌లెట్స్ తగ్గడం గమనార్హం.

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

జ్వరపీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు కూడా జ్వరపీడితులు వస్తున్నారు. బాధితుల్లో కొంతమంది ఓపీ విభాగంలో చికిత్స చేయించుకుని వెళ్లిపోతుండగా, మరి కొంతమంది ఇన్‌పేషెంట్లుగా ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

నెలకు 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగం

జ్వరాల వ్యాప్తి ప్రస్తుతం ఎక్కువగా ఉండడంతో ప్లేట్‌లెట్స్ వినియోగం కూడా ఎక్కువగానే ఉంది. నెలకు 150మంది నుంచి 200 మందికి ప్లేట్‌లెట్స్ వినియోగిస్తున్నారు. అవి


ప్లేట్ లెట్స్

తగ్గిపోయిన రోగుల కోసం బంధువులు బ్లడ్‌బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ సకాలంలో ఎక్కించకపోతే ప్రాణాల మీదికి వస్తుందని వైద్యులు చెప్పిన వెంటనే రోగి బంధువులు ప్లేట్‌లెట్స్ తెచ్చి వైద్యసిబ్బందితో రోగులకు ఎక్కిస్తున్నారు.

81 డెంగీ కేసులు నమోదు:

జిల్లాలో ఇంతవరకు డెంగీ కేసులు 81 నమోదయ్యాయి. అలాగే వైరల్ జ్వరాలు 1.80 లక్షల మంది వరకు నమోదయ్యాయి. మైదాన ప్రాంతంతో పాటు గిరిజన ప్రాంతాల్లోను అధికంగానే జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. జ్వరాల బారిన పడినవారు కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందగా, మరికొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డెంగీ జ్వరం బారిన పడిన వారితో పాటు వైరల్ జ్వరం వచ్చిన వారికి కూడా ప్లేట్‌లెట్స్ తగ్గడంతో వారికి ఎక్కించాల్సిన పరిస్థితి.

అవసరమైన వారికి అందజేత

డెంగీ జ్వరంతో పాటు వైరల్ జ్వరం వచ్చిన వారికి ప్లేట్ లెట్స్ తగ్గుతుంటాయి. దీంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు ప్లేట్‌లెట్స్ కోసం వచ్చిన వారికి అందిస్తున్నాం.

డాక్టర్ పి.స్వాతి, పెథాలజిస్టు, బ్లడ్ బ్యాంక్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి